కరుణానిధికి 16 ఏళ్ల వయసులో క్విట్ ఇండియా వుద్యమం వచ్చింది. 18, 19 ఏళ్ల వయసు వచ్చేసరికి స్వాతంత్ర్యోద్యమం మంచి పక్వదశలో వుంది. ఇవేమీ అతన్ని ఆకర్షించలేదు. అసలు పెరియార్‌కే స్వాతంత్ర్యోద్యమం నచ్చలేదు. స్వాతంత్ర్యం వస్తే బ్రాహ్మణులకే అధికారం వస్తుందని ఆయన ఉద్దేశం. అందువలన 1947 ఆగస్టు 15 ని శోకదినంగా గడపమని తన అనుచరులకు ఆదేశాలిచ్చాడు. (అన్నా ఆయనతో ఆ అంశంలో విభేదించారనుకోండి). స్వాతంత్ర్యోద్యమం అంటే బ్రిటిషు వారికి వ్యతిరేకంగా వెళ్లడమన్నమాట. పెరియార్‌కానీ, అతని వీరాభిమాని కరుణానిధి కాని ఆ మార్గంలో ఎందుకు వెళతారు? అందువలన కరుణానిధి ఎంత రాజకీయవేత్తలా డ్రస్ వేసుకున్నా, ఎన్ని సమావేశాలు పెట్టినా, ఏం మాట్లాడినా బ్రిటిషువారు ఏమీ అనలేదు. కరుణానిధి జైలుకి వెళ్లినా దేశస్వాతంత్ర్యం కోసం ఎప్పుడూ వెళ్లలేదు.

19 వ యేట వుండగానే కరుణానిధి ప్రేమలో పడ్డారు. ఆ అమ్మాయి పేరు శారద. అతనికి దూరపుబంధువు. సీరియస్‌గా ప్రేమించినట్టే లెక్క. ఎందుకంటే పెళ్లి చేసుకుంటానన్నాడు. కానీ ఆమె తల్లిదండ్రులకి కరుణానిధి విధానం నచ్చలేదు. డికె వాళ్లను అప్పట్లో నల్లచొక్కా గాళ్లనేవారు. దేవుడు లేడనడమే కాదు, అల్లరి చేయడం, ప్రదర్శనలు చేయడం, నాటకాలేయడం, ఊళ్లట్టుకుని తిరగడం, ఉపన్యాసాలు దంచడం యివన్నీ ఏ పిల్ల తండ్రికి నచ్చుతాయి? పైగా యితనికి చదువు, ఆదాయం రెండూ లేవు. పెళ్లి చేయం పొమ్మన్నారు.

అయితే ఆ అమ్మాయి కబురంపించింది. నిన్ను చేసుకోవడం వీలుపడక పోతే చావనైనా ఛస్తాను తప్ప వేరేవాణ్ని చేసుకోనని. దాంతో కరుణానిధికి ధైర్యం వచ్చి ఆమెతో కలిసి లేచిపోయేందుకు సర్వసన్నాహాలు చేసుకున్నాడు. అయితే ఆఖరి నిమిషంలో ఆమె అమ్మానాన్నలకు విషయం పొక్కింది. పట్టుకున్నారు. గ్రామపెద్దల ఎదుట పంచాయితీ జరిగింది. ఆ అమ్మాయి అందరి ఎదుటా "నాకు యితనంటే యిష్టం లేదు. పారిపోదామని అతనే బలవంతం చేశాడు" అని చెప్పింది. బహుశా అమ్మానాన్నా అలా చెప్పించివుంటారు.



దాంతో కరుణానిధి హతాశుడయ్యాడు. పెళ్లి కాకపోగా పరువు కూడా పోయింది. చాలా నిరాశలో కూరుకుపోయాడు. ఇది జరిగిన కొన్ని రోజులకే ఆ అమ్మాయికి వేరే అబ్బాయినిచ్చి పెళ్లి చేసేశారు. కరుణానిధి బాధ చూడలేక అతని తలిదండ్రులు వేరొక బంధువుల అమ్మాయి పద్మావతి నిచ్చి పెళ్లి చేశారు. (పక్కనున్న ఫోటో) అప్పుడతని వయసు 20.

అప్పట్లో అతను "ద్రవిడర్ నడిగర్ కళగం" అనే నాటక సమాజం పెట్టి పెరియార్ ఉపదేశాలను ప్రచారం చేసే నాటకాలు రాసి, దర్శకత్వం వహించి, నటించి ప్రదర్శిస్తూ వుండేవాడు. (నటుడిగా కరుణానిధి ఫోటో చూడండి). అవి పెద్దగా ఆడేవి కావు. తన ప్రేమకథ విఫలమయ్యాక దాన్ని బేస్ చేసుకుని కరుణానిధి "శాంత" అనే నాటకం రాశాడు. అంతా తన కథే. అయితే ముగింపులో తన తలిదండ్రుల ఒత్తిడికి లొంగి ప్రేమికుణ్ని వంచించిన హీరోయిన్ జీవితంలో విషాదం జరుగుతుంది. ఆమె భర్త చనిపోయి వితంతువుగా మిగిలిపోతుంది. ఈ నాటకం రాసి కరుణానిధి తన పగ సాధించాడు.



ఈ నాటకం బాగా హిట్ అయింది. జనాలు విరగబడి చూశారు. అయితే ఒక మెలోడ్రమటిక్ ట్విస్టు ఏమిటంటే కొంతకాలానికి శారద భర్త నిజంగానే చనిపోయాడు. కరుణానిధి షాక్ తిన్నాడు. ద్రవిడ కళగం నాయకుడిగా ఓ పక్క మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే తన నాటకం వలననే శారద మొగుడు చనిపోయాడనే నమ్మకానికి లొంగి, ఆ నాటక ప్రదర్శనను ఆపించేశాడు. కొన్నాళ్ల తర్వాత వేరే పేరుతో మళ్లీ ఆడాడనుకోండి. ఎందుకంటే డబ్బు అవసరం. పెళ్లయి సంసారం ఏర్పడ్డాక ఖర్చులకు తడుముకోవలసి వచ్చింది. పైగా అతను నడిపే నాటకసంస్థ అప్పుల్లో పడి మరింత భారాన్ని పెంచింది.

ఇక రికామీగా తిరిగితే లాభం లేదని ఉద్యోగం చేయాలనుకున్నాడు. "తొళిలాలర్ మిత్రన్" (కార్మికమిత్ర) అనే పత్రికలో చేరి రాజకీయనాయకులపై వ్యంగ్యవ్యాసాలు రాసేవాడు. ఈ పత్రికవాళ్లు అతనికి ఆఫీసుటైములో నాలుగు కప్పుల టీ యిప్పించడం తప్ప వేరే జీతం యిచ్చేవారు కారు. దానికి తోడు మహాత్మా గాంధీని వెక్కిరిస్తూ యితను రాసిన వ్యంగ్యవ్యాసం కాంగ్రెస్ వాళ్లను మండించింది.

ద్రవిడ కళగం వారు పాండిచ్చేరిలో పెట్టిన మీటింగులో వారు కసి తీర్చేసుకున్నారు. వక్తలుగా వచ్చిన కరుణానిధి, భారతీదాసన్‌లపై (ఆయన కవి) వాళ్లు పురికొల్పిన గూండాలు దాడి చేశారు. భారతీదాసన్ చెప్పులు వదిలేసి కాళ్లకు బుద్ధి చెప్పడంతో తప్పించుకున్నాడు కానీ కరుణానిధి దొరికిపోయాడు. అతనిపై వుపయోగించిన ఆయుధాలలో భారతీదాసన్ వదిలేసి వెళ్లిన నాడాలేసిన చెప్పులు కూడా వున్నాయి. దెబ్బలు బాగా తగలడంతో అతను స్పృహ తప్పాడు. గూండాలు రోడ్డు మీద పడేసి వెళ్లిపోతే దగ్గర్లో వున్న ఓ ముస్లిం

కుటుంబం అతన్ని యింటికి తీసుకెళ్లి అతని గాయాలకు కట్లు కట్టి ముస్లిం వేషం వేసి కళగం హెడ్‌క్వార్టర్సుకు పంపించారు.

దీనివలన జరిగిన మేలేమిటంటే హెడ్‌క్వార్టర్సులో పెరియార్ అతన్ని సాదరంగా రిసీవ్ చేసుకున్నారు. అతనిపట్ల జాలి పడి "కావాలంటే మద్రాసు వచ్చి నా పత్రిక "కుడి అరసు"లో ఉద్యోగిగా చేరు" అని ఆఫర్ యిచ్చారు. అది అతని జీవితంలో ఓ ముఖ్యమైన మలుపు. ఎందుకంటే ఆ పత్రిక కారణంగా కరుణానిధి మద్రాసుకి మకాం మారారు. పెరియార్ అనుయాయులుగా వున్న ఆనాటి ప్రముఖులైన రాజకీయనాయకులందరూ హెడ్‌క్వార్టర్సుకి రావడం వలన అందరితోనూ పరిచయాలు ఏర్పడ్డాయి. కరుణానిధి ఆ పత్రికలో వ్యాసాలు, సంపాదకీయాలు రాసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అప్పటిదాకా చిన్న పత్రికలు రాసి జిల్లా వరకే పేరు తెచ్చుకుంటే కుడి అరసు పత్రిక ద్వారా అతని పేరు రాష్ట్రమంతా మారుమ్రోగింది. అయితే యీ మలుపు యింకో మలుపుకి దారి తీసింది. దాని కథ వచ్చే శుక్రవారం. (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**